| **Headline:** NSE received SEBI's approval for GIFT City int'l Exchange | |
|---|---|
| **Source:** Sakshi | **Date:** 12 January 2017 |

# ఎన్ఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్‌కు సెబీ ఓకే




**గాంధీనగర్:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ) ఏర్పాటు చేయనున్న ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజీకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం లభించింది. ఎన్ఎస్ఈ ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్‌ను గుజరాత్ ఇంటర్నేషనల్ ఫైనాన్స్ టెక్(గిఫ్ట్) సిటీలో ఏర్పాటు చేయనున్నది. ఎన్ఎస్ఈ ఐఎఫ్ఎస్‌సీ పేరుతో ఏర్పాటు కానున్న ఈ కొత్త ఎక్స్ఛేంజ్ వచ్చే నెల మధ్య నుంచి కార్యకలాపాలు నిర్వహించేలా ప్రయత్నాలు చేస్తున్నామని ఎన్ఎస్ఈ సీఈఓ జె. రవిచంద్రన్ చెప్పారు. సెబీ నుంచి మంగళవారమే సూత్రప్రాయ అంగీకారం పొందామని ఇక్కడ జరుగుతున్న వైబ్రంట్ గుజరాత్ గ్లోబల్ సమిట్‌లో ఆయన తెలిపారు. ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజీలో డెరివేటివ్స్, ఇండెక్స్ ఫ్యూచర్స్, కరెన్సీ డెరివేటివ్స్, కమోడిటీల ట్రేడింగ్‌ను ఆఫర్ చేస్తామని వివరించారు. ఇటీవలే ప్రధాని నరేంద్ర మోదీ గిఫ్ట్ సిటీలో బీఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ బీఎస్ఈ ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజ్ ఈ నెల 16 నుంచి కార్యకలాపాలు నిర్వహించనున్నది. కాగా ఇంటర్నేషనల్ ఎక్స్ఛేంజీలు 23 గంటల పాటు ట్రేడింగ్ నిర్వహించుకోవడానికి సెబీ అనుమతినిచ్చింది.